క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సోమవారం నియోజకవర్గంలో గంగాధరనెల్లూరు, కార్వేటినగరం మండలాల్లో పర్యటించనున్నట్లు ఆయా మండలాల కన్వీనర్లు పూర్ణ చంద్రారెడ్డి, శేఖర్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వారు మాట్లాడుతూ మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని గాజులకండ్రిగ గ్రామానికి రూ.70 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఉదయం 6 గంటలకు భూమిపూజ చేస్తారన్నారు. అలాగే 6.30 గంటలకు గంగాధరనెల్లూరు మండలం కొత్రకోన పంచాయతీలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అదే విధంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో చెన్నకేశవస్వామి

విజయపురం (నగరి) : మండల కేంద్రమైన విజయపురంలో ఆదివారం చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ముందుగా స్వామివారికి అభిషేక పూజలు చేపట్టారు. ముందుగా స్వామివారిని వివిధ పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

కబడ్డీ టోర్నీ ప్రారంభం



నింద్ర: మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

నింద్ర: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని నగరి రూరల్ సీఐ రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేద్కర్ కబడ్డీ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల విద్యార్థులు మానసికంగా, దృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో పాల్గొని విద్యార్థులు గొడవలకు జరగకుండా సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏపీ సాహిత్య అకాడమీ డైరెక్టర్ జయశ్రీ, వైస్ ఎంపీపీ శుభ, ఎస్ఐ శివశంకర్, నాయకులు సంపత్, కాటయ్య, ఏలుమలై, బాబు, పాండియన్, ఆర్గనైజర్స్ సతీష్, వెంకటేష్, జాషువా, పవన్, జాన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంపై అవగాహన



విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం

కార్వేటినగరం: విద్యార్థులు చిత్రలేఖనంపై అవగాహన కలిగి ఉండాలని విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణలో భాగంగా ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం కూడా విద్యాబోధనలో ఒక భాగమన్నారు. బొమ్మలు గీయడానికి కొన్ని మెలకువలు పాటిస్తే ఆ బొమ్మ అందంగా కనిపిస్తోందని చెప్పారు. ఈ క్రమంలో భాగంగా రకరకాలైన బొమ్మలతో పాటు జాతీయ పక్షి నెమలి బొమ్మను గీసి విద్యార్థులకు నేర్పించారు. విద్యార్థులు బొమ్మలు గీయడం వల్ల వారి చేతి నైపుణ్యత వెలికి తీయవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి శంకర్‌బాబు, రాఘవేంద్రరాజు, శేషాద్రి, యుగంధర్, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

శివప్రసాద్ మృతికి నివాళి



శివప్రసాద్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న రాంప్రసాద్‌రెడ్డి

వడమాలపేట : మండల పరిధిలోని కదిరిమంగళం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు శివప్రసాద్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థికసాయం అందేవిధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా శివప్రసాద్ కుటుంబసభ్యులకు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, డీసీసీబీ బ్యాంకు డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి పాల్గొన్నారు.

ప్రయోగాత్మక అభ్యసనంతో విజ్ఞానం

వేసవి సెలవులను విద్యార్థులు కాలక్షేపంతో గడేపయకుండా, వారికి ప్రయోజనకరంగా మార్చడానికి ప్రభుత్వం ప్రత్యేక పథక రచన చేసింది. సమగ్ర శిక్ష చిత్తూరు, జిల్లా సైన్స్ మ్యూజియం వారి ఆధ్వర్యంలో అగస్త్య ఇంటర్ నేషనల్ ఫౌండేషన్–గుడుపల్లి వారి సహకారంతో మొబైల్ యాక్టివిటీ బేస్డ్ సమ్మర్ క్యాంపు–2023 నిర్వహణకు శ్రీకారం చుట్టింది. ఈ క్యాంపు ద్వారా ప్రయోగాత్మక అభ్యసనం వైపు విద్యార్థుల అడుగులు పడనున్నాయి. తద్వారా వారి భవిష్యత్‌కు మరింత ఉపయోగపడే అవకాశం ఉంది.

- మొబైల్ యాక్టివిటీ బేస్డ్ సైన్స్ సమ్మర్ క్యాంపునకు ప్రభుత్వం శ్రీకారం
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా పథక రచన
- విద్యార్థుల్లో సందేహాల నివృత్తికి సువర్ణ అవకాశం అంటున్న ఉపాధ్యాయులు



సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న అగస్త్య ఇంటర్‌నేషనల్ ఫౌండేషన్ సంస్థ సభ్యులు

నగరి : జిల్లాలో ఎంపిక చేసిన 18 మండలాల్లోని 54 గ్రామీణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సుమారు 2500 మంది విద్యార్థినీ, విద్యార్థులు వారి పాఠ్యాంశాలలోని ప్రయోగాలను స్వయంగా చేసి అనుభవ జ్ఞానం పొందేందుకు మొబైల్ యాక్టివిటీ బేస్డ్ సమ్మర్ క్యాంపు ఉపయోగపడనుంది. దీని ద్వారా 6 నుంచి 10 తరగతుల విద్యార్థులకు భౌతిక, రసాయనశాస్త్రం, జీవశాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్యంశాల్లోని కృత్యాలు విద్యార్థుల చేత చేయించి వారి సందేహాలు నివృత్తి చేస్తారు. గ్రామీణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 3 మొబైల్ వ్యాన్స్ ద్వారా 15 మంది నిపుణులు విద్యార్థులకు కృత్యాధార కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆయా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కేటాయించిన తేదీల్లో ఈ నెల 31వ తేదీ వరకు (12 రోజులు పాటు) జరుగుతుంది. ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ వహించి విద్యార్థులను అందుబాటులో ఉంచాలి. ఈ మేరకు ఎంఈఓ శ్రీదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని మండలంలోని ఎం.కొత్తూరు, తడుకుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నారు. జిల్లా సైన్స్ అధికారి పర్యవేక్షణలో జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి వారి ఆధ్వర్యంలో వారి సలహాలు, సూచనలతో ఉప విద్యాశాఖ అధికారుల సమన్వయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు.

విద్యార్థులకు చాలా ఉపయోగకరం..

- మొబైల్ యాక్టివిటీ బస్ 6–10వ తరగతి విద్యార్థుల అభ్యసనాన్ని సులభతరం చేస్తుంది.
- ఈ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక అభ్యసనాన్ని పెంపొందించేలా ప్రోత్సాహం అందుతుంది.
- సృజనాత్మక మార్గాలను రూపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు అవకాశం లభిస్తుంది.
- ప్రభుత్వ స్కూళ్లలో శాస్త్రీయ అభ్యసనాన్ని సులభతరం చేయడానికి తగిన మౌలిక సదుపాయాలను కల్పించడం ద్వారా విద్యావ్యవస్థ మరింత మెరుగుపడుతుంది.
- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో కార్యాచరణ ఆధారిత అభ్యసనం, వినూత్న ఆలోచనల ద్వారా జ్ఞానం పొందడానికి ఉపయోగపడుతుంది.

ఒక వినూత్న కార్యక్రమం..



లర్నింగ్ బై డూయింగ్ ద్వారా విద్యార్థులు నేర్చుకున్న అంశాలు ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఈ వేసవి కృత్యాధార మొబైల్ సైన్స్ ల్యాబ్ ప్రధాన లక్ష్యం. అలాగే కాన్సెప్టులను సులభంగా అర్థం చేసుకునేలా విద్యార్థుల మనసుకు హత్తుకునేలా కార్యక్రమాలు చేయడం ఇది విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– శ్రీదేవి, ఎంఈఓ, నగరి





కృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అలరించిన అర్జున తపస్సు





తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి, తపస్సుమాను వద్ద సంతానం కోసం వరపడుతున్న మహిళలు

శ్రీరంగరాజపురం : మండల పరిధిలోని తయ్యూరు పాయకట్టు, అంకనపల్లిలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం ద్రౌపదీదేవి ఉత్సవమూర్తితో పాటు శ్రీకృష్ణ, భీమ, అర్జున, నకుల, సహదేవుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం 11 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి పద్యాలను ఆలపిస్తూ తపస్సుమానును అధిరోహించారు. ఈ సందర్భంగా పైనుంచి విబూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద వరపడి స్వామివారిని వేడుకున్నారు. అర్జున తపస్సుకు సంబంధించిన ఘట్టాన్ని భాగవతారిణి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా రామచంద్రారెడ్డి, వెంకటేష్ వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త లింగారెడ్డి, కార్యనిర్వాహకులు రామనాథరెడ్డి, లోకనాథరెడ్డి, డిసెంబర్‌శెట్టి, దాముఆచారి, నరసింహులు నాయుడు, నటరాజ్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ముత్తుమారియమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ముత్తుమారియమ్మ

పిచ్చాటూరు: నాగలాపురం ముత్తుమారి అమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి కంకణం ధరించిన భక్తులు భక్తిశ్రద్ధలతో అగ్నిగుండం ప్రవేశం చేశారు. అమ్మవారి వార్షిక తిరుణాళ్లలో భాగంగా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ఉగ్రరూపిణిగా అలంకరణ చేసి గ్రామవీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారి ఎదుట భక్తులు అగ్నిగుండం ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివి



నగరి బస్టాండు ప్రాంగణంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

నగరి : మాజీ ప్రధానమంత్రి భారతరత్న రాజీవ్ గాంధీకి స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ శ్రీ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకుని నగరి బస్టాండ్ వద్ద చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి, పూజలు చేసి స్మరించుకున్నారు. అలాగే పేదలకు అన్నదానం చేశారు. అనంతరం శ్రీ పెరంబుదూర్ వెళ్లి రాజీవ్‌గాంధీ స్మారక స్థూపం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో రాజీవ్‌గాంధీ సేవలు ఎనలేనివని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ మెంబర్ భానుమూర్తి, పీసీసీ మెంబర్లు నటరాజ మొదలియార్, సుధాకర్ రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబు, చిరంజీవి రెడ్డి, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య, మున్సిపల్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాపిచ్చి, నాయకులు పాల్గొన్నారు.

విజయపురంలో..

విజయపురం: మండలకేంద్రం విజయపురంలో ఆదివారం మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీకి కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి రాజకీయ నాయకులకు రాజీవ్‌గాంధీ జీవిత్ర చరిత్ర ఓ ఆదర్శంగా నిలిచిందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల కోసం జీవించిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సుధాకర్‌రాజు, నాయకులు నారాయణరాజు, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

చెరుకుతోటలో కలుపు తీసే పనిలో నిమగ్నమైన మహిళా కూలీలు



పచ్చని పైరులో కూలీ రాగాలు

పాలసముద్రం : గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతలు పొలం పనుల్లో బిజీగా గడుపుతున్నారు. ఈ ఏడాది వర్షాలు సంమృద్ధిగా కురవడంతో అన్నదాతలు పొలాల్లో పంటలు సాగు చేపట్టారు. ప్రభుత్వం కూడా రైతులకు ఆర్బీకేల ద్వారా సకాలంలో ఎరువులు, విత్తనాలు అందిస్తోంది. అలాగే రైతు భరోసా నగదు సకాలంలో రైతుల ఖాతాల్లో జమ అవుతుండడంతో మరింత తోడుగా నిలుస్తోంది. ప్రస్తుతం మండలవ్యాప్తంగా రైతులు చెరుకు, వరి, వేరుశనగ పంటలు సాగు చేశారు. అయితే పైరు బాగా పెరిగే తరుణంలో ఇటీవల వర్షాలు పడ్డాయి. దీంతో పంటలతో పాటు కలుపు పెరగడంతో అన్నదాతలు కలుపు తొలగించే పనుల్లో బిజీ అయ్యారు. కలుపు తీసే పనులకు మహిళా కూలీల అవసరం ఎక్కువ కావడంతో వారికి డిమాండ్ ఏర్పడింది. కలుపు తీయడానికి వచ్చిన మహిళలు పొలాల్లో పాటలు పాడుతూ పని చేస్తుండడం గమనార్హం.



వరి పంటలో కలుపు తీస్తున్న మహిళలు

● కల్పతరువొంటె..



ఒంటెపై సవారీ చేస్తున్న పిల్లలు

● ఓ కుటుంబానికి పదేళ్లుగా అదే ఆదరువు

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలో ఆదివారం ఓ వ్యక్తి ఒంటెను తీసుకుని వచ్చాడు. వీధుల్లోకి రాగా పిల్లలు ఒంటెపై సవారీ చేయడానికి ఆసక్తి చూపారు. అతను రూ.50 అని చెప్పగా పిల్లలు ఆనందంగా ఒంటెపైకి ఎక్కి సవారీ చేస్తూ కేరింతలు కొట్టారు. అయితే ఒంటెతో వచ్చిన వ్యక్తి గురించి ఆరా తీయగా అతని పేరు రంగయ్య.. నెల్లూరు జిల్లా కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లి. ఇతను ఒంటెను వెంట పెట్టుకుని ఊరూరా తిరుగుతూ నాలుగు డబ్బులు సంపాదించుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. పదేళ్ల కిందట హైదరాబాద్‌లో రూ.80 వేలు పెట్టి ఓ చిన్నఒంటె పిల్లను కొనుగోలు చేశాడు. అది ఇప్పుడు పెద్దదైంది. ఇప్పుడు సవారీకి వెళ్తే రోజుకు రూ.500 నుంచి రూ.800 వరకు సంపాదించి తన యజమాని కుటుంబాన్ని పోషిస్తోంది. రంగయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. పెద్ద కూతురికి వివాహం చేశాడు. రెండో కూతురు ఇంటి వద్దే ఉంటూ చదువుకుంటోంది. భార్య నాగరత్నంతో పాటు చిన్న కుమారున్ని వెంట పెట్టుకుని ఊరూరు తిరిగి ఒంటె సవారీతో వచ్చే ఆదాయంతో పొట్ట నింపుకుంటున్నాడు. ఏ ఊరు వెళ్లినా వారం రోజుల పాటు అక్కడే ఉంటూ కొంతడబ్బు సంపాదించుకుని, మరోఊరు వెళ్తాడు. అలా బతుకుదెరువులో భాగంగా పుత్తూరుకు వచ్చాడు. దీంతో పలువురు చిన్నారులు ఒంటెపై సవారీ చేసి ఆనందించారు.

ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువులనే వాడండి



ఐఎస్ఐ మార్కు గురించి అవగాహన కల్పిస్తున్న సంస్థ సిబ్బంది

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం) : వినియోగదారులు ప్రతిఒక్కరూ ఐఎస్ఐ మార్కు ఉన్న వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని స్టాండర్డ్స్ ప్రమోషన్ అధికారి కృష్ణ వీర్‌వర్మ అన్నారు. ఆదివారం మండలంలోని 9వ మైలు వద్ద ఉన్న ఆశ్రమం సమావేశ భవనంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ విజయవాడ వారి సౌజన్యంతో మహిళలకు, విద్యార్థులకు ఒక్కరోజు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఎస్ఐ గుర్తు ఉన్న వస్తువులను మాత్రమే వినియోగించాలని సూచించారు. ప్రతి నిత్యం వాడుతున్న గ్యాస్ సిలిండర్ మీద కూడా మంచి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా బంగారు మీద హాల్‌మార్కు హెచ్‌యూఐడీ మార్కు కచ్చితంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా అందుబాటులో ఉంటున్న ఐఎస్ఐ క్యార్ మొబైల్ యాప్‌ను ఉపయోగించుకుని మరింత సమాచారం తెలుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రూరల్ యాక్షన్ సెక్రటరీ మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే వీటి సమాచారాలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో క్రాస్ ఎన్‌జీఓ రూరల్ యాక్షన్ సంస్థ భూపతి, చందు, బేబీ, పద్మావతి, ట్రైనర్స్ జ్యోతి, సరస్వతి, మణి పలువురు పాల్గొన్నారు.

కనుల పండువగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



భక్తులకు అన్నదానం చేస్తున్న వీరబ్రహ్మం

తిరుపతి కల్చరల్: మహతిలో ఆదివారం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.భారతి ఆధ్వర్యంలో టీటీడీ సహకారంతో నిర్వహించిన శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఇందులో భాగంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, హోమం, విశ్వకర్మ మహాయాగం, గణపతి హోమం, సుదర్శన హోమం, మహాలక్ష్మీ హోమం, మృత్యుంజయ హోమం, ఆయుష్షు, సౌభాగ్య హోమాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీగోవిందమాంబ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 2.05 నుంచి 4 గంటల వరకు కల్యాణోత్సవం వేడుకగా చేపట్టారు. కర్ణాటక ఆశ్రమం శివసిద్ధేనందస్వామి, కాశీ కైలాస మఠం జ్యోతిరాధానంద స్వామి అనుగ్రహణ భాషణం చేశారు. సుధా బ్రహ్మ స్టీల్స్ అధినేత వీరబ్రహ్మం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరబ్రహ్మేంద్రస్వామి వారి వంశీయులైన 8వ తరం మునిమనవడు నొస్సం వీరభట్లయ్య స్వామి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గిరిబాబు ఆచారి, మార్గాచార్యులు ఉమాపతి ఆచారి, కార్తీక్ ఆచారి, శివాచారి, మురళీకృష్ణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

పశువుల కొనుగోలుకు రైతులకు రుణాలు

తిరుపతి అర్బన్: పాడి రైతులు పశువులను కొనుగోలు చేయడానికి రుణాలు మంజూరు చేయడానికి ప్రభుత్వ కసరత్తు చేస్తోందని జిల్లా పశువైద్యాధికారి రవికుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఆర్‌డీఏ సెర్ప్ విభాగానికి చెందిన అధికారులు ఆ మేరకు చర్యలు ప్రారంభించారని పేర్కొన్నారు. అమూల్ పాల సేకరణలో భాగంగా జిల్లాలోని నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో ఇప్పటికే 4 వేల లీటర్లకు పైగా పాల సేకరణ చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. పాల ఉత్పత్తిని పెంచడానికి పాడి రైతులకు తొలి దశలో నారాయణవనం, వడమాలపేట, పుత్తూరు మండలాల్లో రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. తర్వాత జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారని తెలియజేశారు. పాడి రైతులు తమ పరిధిలోని సచివాలయంలో ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుని ప్రయోజనం పొందాలని సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశువులకు నీటి కొరత లేకుండా చూడాలని తెలిపారు.